# లాస్ట్ బోర్డింగ్

● డి. అంజయ్ నాయుడు

''మందాకిని.'' పేరుకు తగ్గ అందం- బంగారు రంగు శరీర ఛాయ- విశాలమైన నుదురు, విల్లులా వంగిన కనుబొమ్మలు.

ఎవర్నైనా ఇట్టే ఆకర్షించే అయస్కాంతం లాంటి కళ్ళు లిప్‌స్టిక్‌తో పనిలేని మృదువైన ఎర్రని పెదాలు, సంపెంగలాంటి ముక్కు, ముత్యాల్లా అందమైన పలువరుస, ఆడవాళ్ళను సైతం మెస్మరైజ్ చెయ్యగల అందం ఆమెది.

తను కాలేజీలో చదివే రోజుల్లో బస్ స్టాప్‌లో గుండెలకి అడ్డాదనగా పుస్తకాలు పట్టుకొని బస్సు కోసం వెయిట్ చేస్తున్న ఆమె అందానికి ముగ్ధులైన ఎందరో అబ్బాయిలు దీపంచుట్టూ మిడతల్లా తిరిగేవారు. ఆమెను జీవిత భాగస్వామిని చేసుకోవడానికి ఎంతో మంది తహతహలాడారు. క్లాసురూంలో కూడా ఆమె దృష్టినాకర్షించడానికి ఎంతో మంది విశ్వప్రయత్నాలు చేసేవారు. కానీ మధ్యతరగతికి చెందిన .మందాకినికి, గుమాస్తా మోహన్ జీవిత భాగస్వామిగా దొరికాడు మొదటిరాత్రి.

మంచానికి తోరణాలుగా కట్టిన మల్లెలు- ప్లేట్లల్లో అనవాయితీ ప్రకారం అరటిపళ్ళు, బత్తాయిలు, ఏపిల్స్, ద్రాక్షపళ్ళు రకరకాల స్వీట్లు- రూమంతా అగరొత్తుల పరిమళం- తాతలనాటి సాంప్రదాయంగా వస్తున్న పట్టె మంచం- పడకగదిలో ముస్తాబై ఎదురు చూస్తుంది. మోహన్ మందాకినీ ఆగమనం కోసం క్షణాలు లెక్కిస్తూ అసహనంగా పచార్లు చేస్తున్నాడు- మధ్య మధ్యలో బాగా దాహంతో నీళ్ళు తాగుతున్న కాకిలా తలుపువైపు తలతిప్పి చూస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే తప్పనిసరైన పాలగ్లాసుతో మందాకినీ పట్టు చీరలో రవివర్మకి అందని అందంలా సిగ్గుతో తడబడే అడుగుల్తో లేడి పిల్లలా బిత్తర చూపులతో గదిలో అడుగు పెట్టింది.

బయట వెన్నెల చల్లగాకాస్తుంది.

చల్లని చిరుగాలికి కిటికీలోంచి సన్నజాజి రెమ్మ తొంగి చూస్తుంది.

ఆమె భుజాల మీద చేతులు వేశాడు మోహన్.

ఉలికిపాటులో చిరు నవ్వు తొణికిసలాడింది.

ఆమె పెదవుల్నించి అలవోకగా కదిలిన చిరునవ్వు సన్నని ఫ్లాష్ గ్లూమీలైట్లో వింతగా మెరిసింది.

ఆమెను నెమ్మదిగా హృదయానికి హత్తుకున్నాడు. మల్లెలు తుళ్ళిపడ్డాయి. క్రమక్రమంగా, మత్తుగా అతని గుండెల మీద తలవాల్చింది. ఆమె పెదవుల్ని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె చేతులు అతని మెడచుట్టూ పెనవేసుకున్నాయి.

ఇద్దరూ- ఏవో తెలియని లోకాల తలుపులు తెరుచుకుని వింత సామ్రాజ్యంలో విహరించారు.

రోజులు సాఫీగా దొర్లుతున్నాయి. ఇద్దరి జీవితంలోచీకూ, చింత లేకుండా సంసారం సాగిపోతుంది. ఎటొచ్చీ మందాకినికి సిటీ జీవితం కొత్తగావడంవల్ల రద్దీగా ఉండే బస్సుల్లో ప్రయాణం చెయ్యడమే కొంచెం కష్టంగా ఉంది. సిటీకి కొత్తగా వచ్చినవాళ్ళకు ద్రాక్షగుత్తుల్లా, అరటి గెలల్లా బస్సు రెండు ద్వారాలకు వేలాడుతూ ప్రయాణించేవాళ్ళను చూస్తుంటే ఏషియాన్ సర్కస్ ఫీట్సు గుర్తొస్తాయి. ఒక్కోసారి కండక్టరు పరిస్థితికి జాలివేస్తుంది. కాలుగాలిన పిల్లిలా అంత రద్దీలోనూ, వెనక నుంచి ముందుకూ, ముందు నుంచి వెనక్కూ పచార్లు చెయ్యడం తప్పదు- సిటీబస్సులో కండక్టరుగా పని చేస్తే జీవితంలో ఎంత క్లిష్టమైన సమస్యనైనా తేలిగ్గా ఎదుర్కోవచ్చేమో-

ఒకరోజు మందాకినీ బస్టాప్‌లో ఎదురు చూస్తోంది. తను ఎక్కవలసిన బస్సు రావడంలో అప్పటికే డోరు దగ్గర ద్రాక్ష గుత్తుల్లా వేలాడుతున్న జనం మధ్యలోంచి రష్ ఛేదించుకుంటూ మెల్లగా లోపలకు నడిచింది. కండక్టర్ అందర్నీ లోపలకు పంపుతున్నాడు. మామిడి తోరణాలకు ఆకులు గుచ్చుతున్నట్టు ఒకరి వెనక ఒకర్ని నిలబెడుతున్నాడు. ఇంకో వైపు నుంచి మగవాళ్ళు తోసుకొస్తున్నారు. ఇంకా ఎక్కేవాళ్ళు చాలా మందున్నారు. ఇంకొంచెం లోపలికి కదలండని అందర్నీ గదమాయిస్తున్నాడు. ఉన్నట్టుండి [illegible] రైట్ చెప్పాడు. డ్రైవర్ తన ప్రతాపాన్ని చూపిస్తూ గేరులో ఉన్న బండిని స్టార్ట్ చేసాడు. పంచ కళ్యాణి గుర్రంలా బస్సు ముందుకు గెంతింది. అందరూ ఒకరి మీద ఒకరు పడ్డారు. సీట్లలో సెటిలయిన వాళ్ళకి సగానికిపైగా గెడ్డాలు, ముక్కులు ముందు రాడ్‌కి తగిలి స్వల్పంగా చిట్లాయి. మందాకినీ ఏదోలా బస్సురాడ్ పట్టుకుని పడిపోకుండా బేలెన్సింగ్ నిలబడింది. మగాళ్ళవైపు నుంచి ఒక పోకిరీగాడు పూర్తిగా మందాకిని శరీరం తాకుతూ నిలబడ్డాడు. చాచి లెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది. ఎలాగోలా తనను తాను నిభాయించుకొని కొంచెం వెనక్కి జరుగుతారా అంది.

ఎనక జాగా ఉందో లేదో కళ్ళు కనబడ్డంలేదా?

ఏంటలా మీద మీద పడుతున్నారు-

నాకు నీమీద పడాలన్నా షోకేమీ లేదు- డ్రైవర్ బ్రేక్ కొడుతున్నాడు- నేను ముందుకు జర్కిస్తున్నా- అంటే- అంతగా సుకూన్‌గా రావాలనుకుంటే మారుతీలో రావద్దామల్లా- నేనేం బేవకూఫ్‌లెక్క గొడ్తన్నానా ఎనక్కు జరుగు- ముందుకు జరుగు అంటవ్- జర్దాపాకెట్ పళ్ళలో కొరికి ఓపెన్ చేసి పూర్తిగా గుప్పెట్లో పోసుకుంటూ-

నువ్వైనా సమఝాయించరా భాయి- కండక్టర్- ఈమె పానం బేజారవుతుందంట- వెటకారంగా కండక్టరువైపు చూస్తూ అన్నాడు-

అచ్చం తెలుగు సినిమాలో పక్కా విలన్ పోలికలున్న ఆరడుగుల విగ్రహాన్ని చూసి, వీడితో కిరికిరి మనకెందుకని కండక్టరు టికెట్లు చించుతూ- కొంచెం సబురు చెయ్యాలమ్మా- ఇది బస్సుకదా- ఆరడుగుల శాల్తీ నిప్పుల్లాంటి కళ్ళవైపు చూస్తూ కోపం చెయ్యకన్నా- నీ కాల్మొక్కుతానే అందకపోయినా వాడి గడ్డం అందుకుంటూ బ్రతిమిలాడుతూ అన్నాడు.

ఇక వీళ్ళతో ఆర్గ్యుమెంటు అనవసరమనుకుని మెల్లగా ముందుకు జరిగి అంత రష్‌లోనూ ఎలాగోలా అడ్జస్ట్ అయ్యింది.

ఇక జన్మలో బస్సెక్కకూడదన్నంత విసుగొచ్చింది.

మధ్య తరగతి వాళ్ళకు ఇలాంటి విసుగు రావడం- ఎలాగోలా అడ్జస్ట్ అయి మళ్ళీ

ప్రయాణం చేస్తుండటం- షరా మామూలే-

బస్సు దిగి విసుగ్గా ఇంటికి చేరుకుంది- సోఫాలో బాగ్ గిరాటేసి- పేపర్లో దీర్ఘంగా నిమగ్నమై ఉన్న మోహన్‌తో- ఏవిటండీ ఇవాళ త్వరగా వచ్చేసారు.

బస్సు టైమ్‌కి దొరికిందా?



దొరకడమా- పాడా- ఇదే రూట్లో వెళ్తున్న మా ఫ్రెండ్ డ్రాప్ చేసివెళ్ళాడు-

నేను వచ్చే బస్సు ఏరోజూ టైమ్‌కి రాదు. వచ్చినా ఆ డ్రైవరు స్టాప్‌కి ఫర్లాంగ్ దూరంలో ఆపుతాడు- వాడికదో సరదా- పరుగెత్తుకుంటూ వెళ్ళి ఎక్కాలి. పేపరు టీపాయి మీద గిరాటేస్తూ విసుగ్గా అన్నాడు-

ఈ బాధంతా ఎందుకండీ? మా ఆఫీసులో వెహికిల్‌లోను ఇస్తున్నారు అప్లైయ్ చేసాను. రెండు రోజుల్లో లోన్ సాంక్షన్ అవుతుంది. దారిలో నన్ను మా ఆఫీసులో డ్రాప్ చేసి మీరు ఆఫీసుకు వెళ్ళొచ్చు.

మందాకినీ- మై స్వీట్ డార్లింగ్ ఎంత సంతోషమైన వార్త చెప్పావోయ్- ఊ ఇదిగో అడ్వాన్స్‌గా ఓ స్వీట్‌కిస్-

ఆ రోజు గురువారం ఇద్దరూ పే ఆర్డర్ తీసుకెళ్ళి షోరూమ్‌లో నచ్చిన స్కూటర్ కలర్ సెలెక్ట్ చేసుకున్నారు. సాయిబాబా గుడి దగ్గర పూజ చేయించి మొదటిసారి శ్రీమతిని ''నా పెళ్ళాం నా యిష్టం'' సినిమాకి తీసికెళ్ళాడు.

ఇక బస్సుల బాధ తప్పింది. తను ఇష్టమొచ్చిన టైంలో ఇష్టమొచ్చిన ప్రదేశానికి శ్రీమతిని తీసుకెళ్ళొచ్చు. జీవితంలో ఓ మంచి నేస్తం దొరికినంత తృప్తి, సంతోషం, ఆనందం కలిగాయి.

పిక్చర్ అయింతర్వాత మోహన్ మల్లెపూలుకొన్నాడు.

కొత్త స్కూటర్ నడిపిన ఆనందంలో భార్యకు ఆనందపు అంచులు చూపించాడు. రోజూ 8 గంటలకల్లా తయారయి బస్సుల కోసం పరుగెత్తడం అలవాటు- ఆరోజు కూడా రోజూలానే ఎనిమిది గంటలకల్లా టిఫిన్ రడీ చేసి ఇద్దరి క్యారియర్లు సర్దేసింది.

ఇవాళ అంత అదుర్దా ఎందుకోయ్- స్కూటరుందిగా- మెల్లగా తొమ్మిది గంటలకి బయలుదేరినా- తొమ్మిదిన్నరకి నిన్ను డ్రాప్ చేసి- పదింటికల్లా మా ఆఫీసుకివెళ్ళొచ్చు.

ఇద్దరూ- టిఫిన్ చేసారు- మోహన్ నీట్‌గా డ్రెస్ చేసుకుని స్కూటర్ బయటకు తీసి స్టార్ట్ చేసాడు-

త్వరగా రావోయ్ టైమయింది.

ఇదుగో వస్తున్నానండీ- రెండు క్యారియర్లు సర్దేసి మోహన్ ఆఫీసు ఫైళ్ళు తీసుకుని దాదాపు పరుగు తీసినట్టు వేగంగా స్కూటర్ దగ్గరకు వచ్చి-

ఇవిగోండి క్యారియర్లు, ఫైల్స్ స్కూటర్ డిక్కీలో సర్దండి.

ఈ డిక్కీతో ఇదొక అడ్వాంటేజ్ బోయ్- మొత్తం లగేజ్ అంతా పెట్టొయ్యొచ్చు.

ఆ- త్వరగా తెములు స్కూటర్ ఎక్సిలేటర్ రైజ్ చేస్తూ అన్నాడు-

స్కూటర్ రేసు గుర్రంలా పరుగెత్తుతుంది.

టాంక్ బండ్ దాటింది. లిబర్టీ దగ్గర ఎవరో పిల్చిన శబ్దం వినిపిస్తే సడెన్ బ్రేక్‌తో ఆపాడు- 'ఏరా మోహన్- కొత్త పెళ్ళాం- కొత్త స్కూటరు- నీకు ఇక మనుషులేం కనిపిస్తార్లే'- ఆఫీసులో తన కొలీగ్ అప్పారావు ఆటపట్టిస్తూ అన్నాడు.

'పార్టీ ఎప్పుడిస్తున్నావురా పెళ్ళి పార్టీ ఎలాగూ మిస్సయ్యాను.

బండి పార్టీ అన్నా ఇస్తున్నావా? లేదా?' వెటకారంగా అన్నాడు.

'ఇస్తాలేరా- ఎలాగూ మంత పిక్నిక్

ప్రోగ్రాం ఉంది కదా- ఆరోజు తప్పకుండా ఇస్తాను.'

భార్యను పరిచయం చెయ్యవేంరా అడుద్దాయి- కొంటెగా మోహన్ని చూస్తూ అన్నాడు.

సారీరా... మీట్ మై స్వీట్ డార్లింగ్. మందాకినీ'' పరిచయం చేసాడు.

''మందాకినీ- మోహన్- వాట్ ఎ బ్యూటిఫుల్ జంట.''

అరే నీ కాంప్లిమెంట్సు అపరా- ఇవాళ మనకి ఆఫీసులో ఏదో ఇన్స్పెక్షన్ ఉందికదా- స్కూటరు మీద వెళదాము-

మరి - సిస్టర్ మందాకిని-

వీళ్ళ ఆఫీసు నారాయణగూడేకదరా- ఆటోలో వెళ్తుంది. చాలా కేజువల్‌గా అన్నారు.

మొదటి రోజు ముద్దుగా స్కూటర్ మీద ఆఫీసుకు వెళ్ళాలనుకుంది. తన ఫ్రెండ్స్ అందరి ముందూ మోహన్ తనని ఆఫీసు దగ్గర డ్రాప్ చేస్తే ఎంత బావుండేది-

'ఏయ్ మందా! కొంచెం దిగు- సారీ ఏం అనుకోవద్దూ- వీడూ నేనూ ఒక అరగంట ముందెళ్ళి ఫైల్స్ రడీ చెయ్యాలి. ఆటోలో వెళ్ళు.''

తన సమాధానం కూడా ఎదురు చూడకుండా స్పీడ్‌గా స్కూటరు ముందుకు లాగించాడు.

ఆటోకి తన దగ్గర చిల్లర కూడా లేదు. తన టిఫిన్‌బాక్స్ కూడా స్కూటర్ డిక్కీలో ఉండిపోయింది. స్కూటర్ కొన్నది తను-

మోహన్‌ని లాగి చెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది.

గత్యంతరంలేక కాలినడకన నారాయణగూడ ఆఫీసు చేరుకుంది.

ఆ రోజు శనివారం. పూజా కార్యక్రమంలో మందాకినీని మగ్నమైంది.

ప్రతి శనివారం వెంకటేశ్వరస్వామి పూజ చేసుకోవడం మందాకినీకి ఆనవాయితీ-

పూజ ముగించుకుని త్వరగా ఆఫీసుకు రడీ అయింది. ఇంతలో మందాకినీ- త్వరగా రడీ అవ్వు- బూట్లు వేసుకుని ఆఫీసుకు రడీ అవుతూ- వరండావైపు వడిగా నడుస్తూ మోహన్ అన్నారు-

క్యారియర్లు సర్ది మోహన్ ఆఫీసు ఫైల్సు పట్టుకుని దాదాపు పరుగెత్తినట్టు నడుస్తూ స్కూటర్ సమీపించింది.

''ఇవిగోండి మీ క్యారియరు- ఆఫీసు ఫైల్స్.''

''నా క్యారియరు హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకున్నాను- పదండి.'' అంటూ స్కూటర్ వెనక సీటుమీద కూర్చుంది మందాకిని.

స్కూటర్ స్టార్ట్ చేసి ఎక్సిలేటరు రైజ్ చేసాడు.

> సిటీలైఫ్‌లో వర్కింగ్ ఉమెన్స్‌కి తప్పనిసరిగా వెహికల్ ఉండాలా? అలాంటప్పుడు భర్తలపాట్లు ఎలా ఉంటాయి!



### త్వరలో నేతాజీ

సినిమా శక్తివంతమైన మీడియా. ఒక లక్ష్యంతో చిత్రం నిర్మించిన రోజున అది సమాజానికి సేవ చేసినట్లే అవుతుంది. పూర్తి యాక్షన్ చిత్రం నేతాజీ బాంబే డయింగ్ మోడల్ 'లీజారే' కథానాయిక. హీరో శరత్‌కుమార్ తనకు ప్రతిష్ఠాత్మక చిత్రమన్నారు. సంగీతం విద్యాసాగర్, సమర్పణ రాజేష్ కుమార్ రెడ్డి, దర్శకత్వం మూర్తికృష్ణ

స్కూటర్ ముందుకురికింది. స్కూటర్ లకడీకాపూల్ దాటింది.

సెక్రటేరియేట్ రూటంతా బస్సులు, ఆటోలు- రకరకాల వెహికిల్స్‌తో జామ్ అయ్యింది. రకరకాల వాహనాలు మేకపిల్లల్ని దొడ్లో తోలినట్టు గుంపులు, గుంపులుగా అసహనంగా కదులుతున్నాయి. ఈ రష్ తగ్గాలంటే కనీసం ఇంకో మూడు గంటలు పట్టొచ్చు. సెక్రటేరియేట్ దగ్గర రాస్తారోకో జరుగుతుంది. ఎవరో అనుకుంటూ వెహికిల్సు వెనక్కు మరల్చుకుని వెళుతున్నారు.

'ఏయ్- మందా! నువ్వు దిగి మెల్లగా నడిచి వెళ్ళు- నారాయణగూడేగా అరగంటలో వెళ్ళిపోతావ్- నేను వేరే రూట్లో ఆఫీసుకి వెళతాను- సమాధానం కోసం ఎదురుచూడకుండా స్కూటర్ వెనక్కు తిప్పి ఉరుకుల, పరుగుల మీద ఇంకో రూట్‌లో వెళ్ళిపోయాడు. స్కూటర్ కొనకముందేనయం- ఆఫీసుకి కరెక్టు టైంకి వెళ్ళేది- రెండోరోజు కూడా ఆఫీసుకి లేటుగా వెళ్ళింది.

ఏవిటీ స్కూటరు కొన్న తర్వాత వరసగా ఆఫీసుకి లేటుగా వస్తున్నావ్. బస్సులో వచ్చే మేమే నయం- పది నిమిషాలు ముందే వచ్చేస్తున్నాం. ఆటపట్టిస్తున్నట్టు అంది లక్ష్మి-

ఏం చెప్పాలో అర్థం కావడంలేదు. మౌనంగా తన సీటు దగ్గరకి వెళ్ళి ఫైళ్ళలో నిమగ్నమయింది మందాకినీ-

మోహన్ స్కూటరు కొన్న తర్వాత రోజూ రాత్రి తొమ్మిది గంటల తర్వాత కాని ఇంటికి రావడంలేదు. ఫ్రెండ్స్‌తో కబుర్లు, షికార్లు, క్లబ్బులు ఎక్కువైనాయి. జీతంలో సగం డబ్బు పెట్రోలుకు ఖర్చవుతుంది. ఇదంతా చూస్తుంటే మందాకినీకి ఒళ్ళు మండిపోతుంది. మింగలేక, కక్కలేక అన్నట్లుంది మందాకినీ పరిస్థితి- తను స్కూటర్ కొనడంవల్ల లేనిపోని అనర్థాలొస్తాయని తను కలలో కూడా ఊహించలేదు. ఏదో రోజు భర్తతో ఖరాఖండీగా యీ విషయం తేల్చుకోవాలనుకుంది.

ఇంకోరోజు పనిమనిషిని నీట్‌గా కడిగిపెట్టమన్నాడు స్కూటర్-

చక్కగా తయారై సెంటు స్ప్రే చేసుకుంటూ-

''ఇవాళ నేను ఆఫీసుకి వెళ్ళడంలేదు. ఫ్రెండ్స్ అంతా కలిసి గండిపేట పిక్నిక్ వేసుకున్నాము. ఎలాగోలా నువ్వు ఆఫీసుకి ఆటోలో వెళ్ళిపో- నేను రాత్రికి కొంచెం లేటుగా వస్తాను. నా కోసం ఎదురు చూడకు. డిన్నరు కూడా బయట చేసివస్తాను.

ఏయ్- నిన్న నీకు అరియర్సు వచ్చాయి కదా- ఓ వెయ్యి రూపాయలుంటే ఇవ్వు- పెట్రోలుకు ఎంత డబ్బైనా చాలి చావడంలేదు. మందాకినీ అందించిన కొత్త నోట్లు పర్సులో పెట్టుకుని- జోరుగా హుషారుగా అంటూ ఈల వేసుకుంటూ స్కూటర్ వేసుకుని వెళ్ళిపోయాడు.

స్కూటరు కొని మూడు నెలలు కాలేదు- మీటరు దాదాపు 18000 కి.మీ తిరిగింది. అంటే రోజుకి 200 కి.మీ అన్నమాట- ఈ మూడు నెలల్లో తనను ముచ్చటగా మూడు

రోజులన్నా ఆఫీసు దగ్గర దించలేదు- తనకెలాగూ బస్సు ప్రయాణం తప్పడంలేదు. స్కూటర్ కొనకముందు సా. 6 గం.కల్లా ఇంట్లో ఉండేవాడు. ఇప్పుడు రాత్రి 10 గం.క్కాని ఇంటికి రావడంలేదు.

దీనికేదైనా పరిష్కారమార్గం కనిపెట్టాలి.

ఏవిటే అలా దిగులుగా ఉన్నావు. ఫైల్సు పక్కనపెట్టి రెండు చేతులమీద తల ఆన్చి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న మందాకినీ మౌనాన్ని భంగపరుస్తూ అంది- తన కొలీగ్ లక్ష్మి.

మందాకిని తన బాధంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

"దీనికంత బాధపడడం దేనికీ- స్కూటరు నువ్వే కొన్నావ్‌గా- స్కూటరు నువ్వు నేర్చుకో. కావాలని కెనటిక్ హోండా కొన్నావ్ కదే- దానికి ఆటోమేటిక్ గేర్సు, గేర్లు మార్చే బాధుండదు- నేర్చుకోవడం చాలా తేలిక. నీకు సైకిలొచ్చుకదా."

"ఊ..."

"అయితే అరగంటలో నేర్చుకోవచ్చు. సెల్ఫ్ స్టార్టర్. కిక్కుకొట్టే బాధ కూడా లేదు. బండి కొన్నావ్ కదా. రేపు గ్రౌండ్స్‌కి వచ్చెయ్. వరుసగా రెండు రోజులు చక్కర్లు కొడదాం. తర్వాత ట్రాఫిక్ రూటులో ఓ వారం ట్రైనింగ్ ఇస్తాను. ముందు లెర్నింగ్ లైసెన్స్‌కి అప్లయ్ చెయ్యి. పక్కా లైసెన్సు నేనిపిస్తాను. నాకు తెలిసినవాళ్ళు ఆర్.టి.ఓ. ఆఫీసులో ఉన్నారు- తను మామూలు ధోరణిలో దీపావళి టపాకాయలు డబ్బా లోపల పేల్చినట్టు గడగడా ఉపన్యాసం ఇచ్చింది.

తననంతా ఆఫీసులో వాగుడుకాయ అంటారు- ఎందుకంటే ఏ విషయమ్మైనా దాచుకోకుండా చాచి లెంపకాయకొట్టినట్టు మొహం మీదే చెప్పేసుంది.

ఓరోజు...

మోహన్ షూ వేసుకుని రెడీ అయి- అద్దం ముందు నిలబడి టై సవరించుకుని, సెంటు స్ప్రే చేసుకుని చిక్‌బుక్ రైలే అంటూ పాడుకుంటూ హుషారుగా బయటకు వచ్చాడు.

అక్కడ రాత్రి తను పార్కు చేసిన స్కూటరు లేదు.

ఒక్క క్షణం గుండె ఆగినంత పనైంది.

అయ్యో బాబోయ్ నా స్కూటరు- రాత్రి ఇక్కడే పార్కు చేసాను. నలభై వేల రూపాయల స్కూటరు- స్కూటరు దొంగలెత్తికెళ్ళినట్టున్నారు బాబోయ్- అసలే ఈ మధ్య రోజుకో దొంగతనం జరుగుతుంది అని అరుస్తూ చిందులేస్తున్నాడు- మందాకినీ- త్వరగారా కాలుగాలిన పిల్లిలా వరండాలో అటూ ఇటూ పరుగెత్తుతూ కేకలేస్తున్నాడు-

పని మనిషి రాములమ్మ పెరట్లో నుంచి పరుగెత్తుకుంటూ వచ్చింది.

'ఏటండీ- అలా కంగారడిపోతున్నారు?'

'ఏం చెప్పమంటావే- స్కూటర్ పోయింది- ఎవరో దొంగలు కొట్టేసారు. అమ్మగార్ని పిలువు-'

'ఇంకెక్కడి అమ్మగా రండి బాబూ-'

'ఏమైందే- యింట్లో లేదా?'

అదేనండి చెబుతూంట- మీ స్కూటరట్టుకుని ఇటువైపుగా ఎల్లారండి.

"ఏవిటీ అదేమన్నా కూరగాయల సంచా? అట్టుకెళ్ళడానికి."

"అట్టుకొనంటే- అట్టుకొనిగాదండి."

"ఇస్కూటరెక్కి- ఇస్టార్టు చేసి తలకేదో తెల్లటి టోపి- ఎండకి తళతళ మెరిసిపోతుంది. అది పెట్టుకుని రయ్‌మని తారాజువ్వలా దూసుకుపోనారండి.

ఏడిచావ్- నీ ఉపన్యాసాలు, ఉపమేయాలు- దానికసలు స్కూటరురాందే-

అయ్యగారు- మీ అమాయకత్వానికి నవ్వాలో, ఏడవాలో అర్థం కావడంలేదు. రోజూ టీవీల్లో చూపించడం లేదేటండీ- ఆడోళ్ళు ఇమానాలు నడపడం- పోలీసులుగా పని చెయ్యడం- కండక్టర్లుగా పని చెయ్యడం- ఆఖరికి కుస్తీ పోటీల్లో కూడా ఆడోల్లేగదండీ- ఈమధ్య చూసానండి టీవీలోగదా, గదా ఎవరో ఒకామె కుందేలులాగా ఏం పరిగెత్తదండీ- ఇంకోకామె ఎదురు బొంగు పట్టుకుని ఆకాశమంత ఎత్తు ఎగిరింది. ఇయ్యన్ని చెయ్యగాలేంది ఇస్కూటరు నడపడం ఎంతపనండి. అమ్మగారు నేర్చుకునే ఉంటారు-" గడగడా చెప్పింది పనిమనిషి.

లెక్చరాపి ముందు నువ్వు లోపలికినడు- ఆఫీసుకి టైం అవుతుంది. టిఫిన్ బాక్సు కూడా సర్దలేదు.

టిఫిన్ బాక్సు నన్నుగాని సర్దమంటారేటి బాబు-

నువ్వు ముందులో పలికి నడుస్తావా? లేదా? నిన్నని లాభం లేదే- అంతా నా కర్మ" నెత్తి బాదుకున్నాడు.

గత్యంతరం లేక గేటు తీసుకుని దిగాలుగా బస్టాండువైపు నడిచాడు మోహన్.

●


భార్యలు, భర్తల్ని ప్రేమించినట్టుగా భర్తలు, భార్యల్ని నిజంగా ప్రేమిస్తారా?

చదవండి

రెండు దశాబ్దాల క్రితమే భార్యాభర్తల సంబంధాల్లోని సున్నితత్వాన్ని తన రచనల ద్వార ప్రకటించి, సంచలనం సృష్టించిన ప్రఖ్యాత మలయాళ రచయిత్రి



కమలాదాస్

జీవితకథ

మై స్టోరీ

తెలుగు అనువాదం

అతి త్వరలో...